


టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



పొరపాటు స్వర్గం

రవీంద్రనాథ టాగోర్

భూలో స్వార్గో (బెంగాలీ,1921)



అతను ఏ పనికొచ్చే పని మీదనైనా నమ్మకం ఉన్న మనిషి కాదు. అతను చేయడానికి పనేమీ లేదు. కానీ, అతనికి సరదా కాలక్షేపాలు చాలా ఉన్నాయి.

అతను చిన్న చిన్న చెక్కపెట్టెలలో మట్టిని నింపుతాడు. ఆ మట్టి మీద గవ్వలను రకరకాల ఆకారాల్లో పేర్చి, అలంకరిస్తాడు. దూరం నుంచి చూడడానికి, ఆ గవ్వలు నీలాకాశంలో ఎగిరే పక్షుల్లాగా, పచ్చిక మైదానాల్లో మేతమేస్తోన్న ఆవుల్లాగా, ఎగిరి దూకే జలపాతాలున్న చిన్నచిన్న గుట్టల్లాగా కనిపిస్తాయి.

అర్థంపర్థం లేని అతని సరదా కాలక్షేపాలను చూసి, అతని చుట్టాలుపక్కాలు ఆటపట్టించే వారు.

అలాంటప్పుడు, అతను చిన్నబుచ్చుకొనేవాడు.

అప్పుడప్పుడు, అతను నిరాశగా తనలోతనే అనుకొనేవాడు.

"చాలు, చాలు! ఇక, ఈ వెర్రిపనులన్నీ మానేస్తాను!"

కానీ, ఆ వేయివిధాల వెర్రి కేవలం అతనితో ఆగలేదు!

★

కొంతమంది పిల్లలు ఏడాది పొడవునా వళ్ళొంచి చదవకపోయినా, పరీక్షలు మాత్రం బ్రహ్మాండంగా గట్టెక్కుతారు. సరిగ్గా అలాగే, అతను ఏ పనీపాటా చేయకుండానే, ఆడుతూపాడుతూ అల్లాటప్పాగా జీవితమంతా గడిపేసాడు.

కానీ, ఆ తరువాత ఉత్తి పుణ్యానికి, అతని కోసం స్వర్గద్వారాలు బార్లా తెరుచుకొన్నాయి. అది తెలుసుకొని అతనే ఆశ్చర్యపోయాడు.

అయితే, అతనిని వెన్నాడే అతని నుదుటిరాత, స్వర్గానికి వెళుతున్నా అతనిని వదలలేదు.

అలా, ఆ సోమరిని తీసుకు వచ్చిన స్వర్గదూతలు పొరపాటుగా పనిమంతుల స్వర్గంలో అతనిని వదిలి వెళ్ళారు.

అది అలాంటి ఇలాంటి స్వర్గం కాదు. అది శ్రమజీవుల స్వర్గం.

అక్కడ అన్నీ ఉన్నాయి. ఒక్క తీరుబడి తప్ప.

అక్కడి మగవారిని కదిలిస్తే అంటారు, "తీరికగా ఊపిరి పీల్చుకొనే సమయం కూడా లేదు."

అక్కడి ఆడవారిని పలకరించబోతే గుసగుసలాడుతారు, "మాకు పనులున్నాయి, డియర్, కబుర్లకు కాలక్షేపాలకు సమయం లేదు."

అక్కడ ఉన్న ప్రతిఒక్కరూ అంటారు, "కాలం విలువైనది." అని.

కానీ, ఒక్కరు కూడా "కాలం విలువ కట్ట లేనిది" అని అనరు!

"అబ్బబ్బ, ఈ పని వత్తిడి ఇక ఎవరం తట్టుకోలేం!" ప్రతిఒక్కరూ నిశ్శబ్దంగా నిట్టూరుస్తారు.

"చివరాఖరి దాకా ఈ పనులు చేయవలసిందే గా!" అన్న చాటుమాటు మాట ఆ స్వర్గమంతా సంగీతంలా ధ్వనిస్తుంది.

అలా అంటూనే, "మా చేతులనిండా పని ఉంది. ప్రతిక్షణాన్ని మేము ప్రయోజకరంగా ఉపయోగించుకొంటున్నాము." అని అంటారు.

ఆ భావనతోనే, పనులు చేసుకొంటూ, అందరూ సంతోషంగా ఉంటారు.

పాపం! మన పనీపాట ఎరుగని సోమరి ఎటూ పారిపోనూ లేడు. అక్కడ ఎక్కడా ఇమడనూ లేడు.

అతని ఊహలు మేఘాల్లో తేలుతోంటే, పనుల హడావుడితో, అటూఇటూ చకచకా తిరిగే తీరిక లేని మనుషులు, అతని దారికి అడ్డం పడుతుంటారు.

చక్కగా నేలమీద చాప పరుచుకొని, తీరికగా కూర్చుందామని అతను అనుకొంటాడో లేదో,

"అరరే! అక్కడ కూర్చుంటున్నావా? అది, ఇప్పుడే నాటేసిన మొక్కజొన్నపొలం!" అని అంటారు ఎవరో ఒకరు.

ఇక, అతను ఏం చేస్తాడు పాపం!

అతను మరోమాట మాట్లాడకుండా, చాపను చుట్టేయాల్సిందే. అక్కడి నుంచి దూరంగా వెళ్ళాల్సిందే.

అటూఇటూ తోసుకొంటూ తిరుగుతున్న పనిమంతుల తొక్కిడిని తప్పించుకొంటూ!

★

ఆ పనిమంతుల స్వర్గంలోని సెలయేరు వద్దకు, ఒక తీరిక లేని అమ్మాయి రోజూ నీటి కోసం వచ్చేది.

బాగా బిగించి, శృతి చేసిన సితార్ తీగెలమీద ధ్వనించే తీవ్ర స్వరంలా, లయబద్ధంగా సాగేది, ఆమె ఉరుకులు పరుగుల పాదాలసవ్వడి. ఆమె జుట్టును, హడావుడిగా బిగించి జడ అల్లుకొన్నా, ఆమె ఉంగరాల ముంగురులు ఆమె నుదిటి పైన గింగిరాలు తిరుగుతూ, ఆమె కనులపైకి వాలేవి.

సెలయేరు కూడా గలగలమని ఏటిపాట పాడకుండా నిశ్శబ్దంగా పారుతూ ఉంది. ఎందుకంటే, పనిమంతుల స్వర్గంలో లొల్లాయి పాటలు పాడి, ఎవరూ శక్తిని వృధా చేసుకోరు. చివరికి ఆ సెలయేరు కూడా!

ఆ పాట పాడని సెలయేటికి ఆవలి గట్టున, పనీపాటలేని సోమరి కదలని చెట్టులా, నిశ్శబ్దంగా నిలబడి ఉండే వాడు. అలా ఉలుకుపలుకు లేకుండా, నిలబడి ఉన్న అతనిని చూడగానే, ఆ అమ్మాయి మనసులో కరుణ ఉప్పొంగేది. ఒక రాజకుమారి తన అంతఃపుర మందిరం గవాక్షంలోంచి, ఒక దీన భిక్షువును చూసినపుడు కలిగే కరుణభావన లాంటి భావన అది.

చూసి చూసి, ఉండబట్టలేక, ఒక రోజు ఆ అమ్మాయి అతనిని జాలిగా అడిగింది.

"అయ్యో! నీ చేతిలో పనేమీ లేదా?"

"నాకు పని చేసేంత సమయం లేదు!," ఆ పని ఎరుగని సోమరి అన్నాడు.

ఆ అమ్మాయికి అతను ఏమి అన్నాడో అర్థం కాలేదు.

"నా చేతుల్లోని పనేదయినా అందుకుని చేస్తావా?" ఆ అమ్మాయి దయతో అడిగింది.

"ఓ పాటలేని సెలయేటి అమ్మాయి! ఈ మాట కోసమే, ఇన్నాళ్ళు నేను ఎదురుచూస్తున్నా! మీ చేతి నుంచి పని అందుకోవాలని అనుకొంటున్నా." అతను ఉత్సాహంగా అన్నాడు.

"నీకు నేనేమి పని ఇవ్వగలను?" ఆ అమ్మాయి బోలెడంత ఆశ్చర్యంగా అడిగింది.

"రోజూ నీటి కోసం సెలయేటికి తెస్తావుగా, ఆ కడవలలో ఒక కడవను ఇవ్వండి!" అతను అడిగాడు.

"కడవతో ఏం చేస్తావు? నీళ్ళను మోస్తావా?" ఆ అమ్మాయి మరెంతో ఆశ్చర్యంగా అడిగింది.

"ఊహు! ఆ కడవ మీద బొమ్మలు గీస్తాను!"

ఆ అమ్మాయికి చిరాకు వేసింది.

"ఇలాంటి అర్థం పర్థం లేని పని చెరుపు మాటలు వినే తీరిక నాకు లేదు. నేను వెళుతున్నా!"

ఆ అమ్మాయి నీటిని నింపుకొని, అక్కడ నుంచి చరచరా వెళ్ళిపోయింది. తన పని మీద తాను.

నిజమేకదా! పనిమంతులు పని లేని సోమరులతో ఎలా కలవగలరు?

అయితే, ప్రతిరోజూ వాళ్ళిద్దరూ ఆ సెలయేటి దగ్గర ఎదుటపడేవాళ్ళు.

ప్రతిసారీ అతను ఆ అమ్మాయిని అదే మాట అడిగే వాడు.

"ఓ పాటలేని సెలయేటి అమ్మాయి! మీ కడవను ఒక్కసారి ఇవ్వగలరా? చక్కగా అలంకరిస్తాను!" అతను పదే పదే అడిగేవాడు.

చివరికి ఆ అమ్మాయి తన ఓటమిని ఒప్పుకొని, తన కడవను అతనికి ఇచ్చింది.

అతను ఆ కడవ చుట్టూ బొమ్మలు వేయసాగాడు. అతని చేతిలోని రంగులతో ఎన్ని ఆటలాడాడో! అతను గీస్తోన్న గీతలు ఎంత లయబద్ధంగా కదులుతున్నాయో!

కడవను అలంకరించడం పూర్తి అయ్యింది.

ఆ అమ్మాయి తన కడవను తీసుకుంది. ఆ కడవని అటూఇటూ తిప్పి తిప్పి, జాగ్రత్తగా పరీక్షించింది.

కనుబొమలను విల్లులా వంచి, అతనిని అడిగింది.

"దీని అర్థం ఏమిటి?"

"దానికి ఏ అర్థమూ లేదు!" అతను తన ధోరణిలో అన్నాడు.

ఆ అమ్మాయి కడవను తీసుకొని, ఇంటికి వెళ్లింది. ఎవరూ చూడకుండా, రహస్యంగా ఆ కడవను దాచిపెట్టింది.

రకరకాల వెలుగుల్లో ఆ కడవమీది చిత్రాన్ని, కనీసం ఓ వందసార్లు పరీక్షించింది. మాటిమాటికి దానిని చూస్తూనే ఉంది.

అర్థరాత్రి నిద్ర లేచి, దీపం వెలిగించింది. ఆ దీపం వెలుతురులో గంటల తరబడి ఆ కడవ మీది చిత్రాన్ని చూస్తూనే ఉండేది. ఒక అర్థంపర్థం లేని విషయాన్ని చూడడం ఆ అమ్మాయి జీవితంలో అదే మొదటిసారి.

మరునాటి ఉదయం, సెలయేటి వద్దకు కడవను తీసుకెళ్ళేటప్పుడు, ఆమె అడుగులు తడబడ్డాయి. నడక లయతప్పింది. ఝుమ్మంటూ ఆమెను చుట్టుముట్టిన ఆలోచనలే, ఆమె ముందరి కాళ్ళకు బంధాలయ్యాయి. అవన్నీ అర్థంపర్థం లేని ఆలోచనలు.

ఆ రోజు కూడా, ఆ పనీపాట లేని సోమరి మనిషి సెలయేటి దగ్గర ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

"నీకు ఏం కావాలి?" ఆ అమ్మాయి అతనిని అడిగింది.

"ఓ పాట లేని సెలయేటి అమ్మాయి! మీ చేతులతో ఏదైనా పని ఇవ్వండి!" అతను బదులు ఇచ్చాడు.

"ఏం పని ఇవ్వాలి?" ఆ అమ్మాయి ఆశ్చర్యంగా అడిగింది.

"మీకు పరవాలేదంటే, రంగురంగు దారాలతో జుట్టుకు చుట్టుకొనే తాడును అల్లిస్తాను."

"దానివలన ప్రయోజనం ఏమిటి?" ఆ అమ్మాయి అడిగింది.

"ఏమీ లేదు!" అతను అన్నాడు.

రంగురంగుల దారాలతో అల్లిన తాళ్ళతో, ఒక అందమైన రిబ్బను తయారయ్యింది.

ఇక అప్పటినుంచి, ఆ అమ్మాయి గంటల తరబడి అద్దం ముందు నిలబడి, తన రంగురంగులదారాల రిబ్బనుతో జుట్టును రకరకాలుగా అలంకరించుకోసాగింది. ఏ పనినీ పట్టించుకోవడం లేదు. అలా రోజులు గడిచిపోయాయి.

★

చూస్తుండగానే, తీరిక ఎరుగని ఆ పనిమంతుల స్వర్గంలో, కుప్పలుతెప్పలు గా ఖాళీలు కనబడసాగాయి.

ఆ ఖాళీలన్నీ పాటలతో, కన్నీటి తడితో నిండి పోయాయి.

సెలయేరు కూడా గలగల మంటూ పారుతూ, అర్థంపర్థం లేని ఏటి పాట పాడ సాగింది. అలలు అలలుగా సాగే ఆ అర్థం పర్థం లేని సెలయేటిపాట పనిమంతుల పనిలో, లయను గతిని మార్చేస్తోంది.

ఈ వ్యవహారమంతా, పనిమంతులస్వర్గం పెద్దలకు తలనొప్పిలా తయారయ్యింది. పనిమంతులస్వర్గంలో గగ్గోలు పుట్టింది. అనిశ్చిత పరిస్థితి నెలకొంది.

ఆ స్వర్గం పెద్దలు అత్యవసరంగా ఒక సమా వేశం ఏర్పాటు చేసారు.

స్వర్గదూత వచ్చాడు. "నేను ఒక పొరపాటు మనిషిని పొరపాటుస్వర్గంలోకి తెచ్చి వదిలాను!" తను చేసిన పొరపాటుకు క్షమాపణ చెప్పాడు, "ఇదంతా అతని వల్లే!"

ఆ పొరపాటుమనిషిని పెద్దల సమావేశానికి పిలిపించారు.

అతని రంగురంగుల తలపాగాను, నేలమీదకు జీరాడే పొడవాటి దుస్తులమీది అల్లికలు, కుట్ల అలంకరణనూ చూడగానే, అక్కడ ఉన్నవారందరికీ, జరిగిన పొరపాటు ఏమిటో అర్థమై పోయింది.

ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ఆ పనిమంతుల స్వర్గపు అధ్యక్షుడు ప్రకటించాడు.

"నువ్వు భూలోకానికి తిరిగి వెళ్ళాలి!"

అతను తన రంగులు కలుపుకొనే పళ్ళాన్ని తీసుకొన్నాడు. తన చిన్న సంచిని సర్దుకొన్నాడు. తేలికగా నిట్టూర్చి అన్నాడు, "నేను వెళుతున్నాను!"

అప్పుడు అక్కడికి, రోజూ పాటలేని సెలయేటి దగ్గరకు నీటికోసం వచ్చే అమ్మాయి వచ్చింది.

అందరినీ చూస్తూ అంది.

"నేను కూడా వెళతాను!"

నమ్మశక్యం కాక, ఆ పనిమంతుల స్వర్గపు అధ్యక్షుడు వింతపడ్డాడు.

ఆ అధ్యక్షుని జీవితంలో మొదటిసారి ఒక అర్థంపర్థం లేని విషయాన్ని చూశాడు.

★

అనుసృజకుల వ్యాఖ్యానం

రవీంద్రనాథ్ **టాగోర్** రచన, "భూలో స్వార్గో" (బెంగాలీ, కవితావచనం) తొలిముద్రణ "ప్రబాసి, కార్తికమాసం, 1328 (అక్టోబర్–నవంబర్, 1921) సంచికలో. ఆ తరువాత, "లిపిక" సంకలనం (ఆగస్టు, 1922) లో జతపరచబడింది.

కవితాత్మక వచనం, **లిపిక**, పేరిట రవీంద్రనాథ్ **టాగోర్** సృజియించిన ప్రయోగాలలో **"భూలోస్వర్గో"** (1921) ప్రసిద్ధరచన.

కేవలం కళ్ళకు కనబడే ఉపయోగం గల పనులే చేయాలన్న భౌతిక ప్రయోజన వాదన (యుటిలిటేరియన్ వాదన) పై చురక ఈ కథ. పనీపాటలకు రెండింటి మధ్యన ఉన్న సంబంధాన్ని వివరించే ప్రయత్నం. స్వర్గం అన్న భావన ను భిన్నంగా సృజియించిన కథ.



వర్క్ లైఫ్ బ్యాలన్స్ గురించి చర్చిస్తున్న ఈనాటి వర్కహాలికుల కాలంలో, మరోసారి తప్పక చదవవలసిన కథ ఇది. పని గాడిలో పడి, మనిషి లో నిబిడీకృతమైన సృజనశీలతను గ్రహించలేంత రోటీన్లలోకి కూరుకుపోవడం, కుంచించించుకుపోవడం, ఆ పరిమితజీవితమే స్వర్గం అనుకోవడం... మాములైపోతున్నప్పుడు, అపరిమితమైన మానవ సహజసామర్థ్యాలను గుర్తుచేస్తూ... పాఠకుల వీపున చెళ్ళున చరిచిన చరుపు ఈ కథ.

ఈ పనిమంతుల స్వర్గంతో పాటు మరెన్నో స్వర్గాలు ఉంటాయన్న భావనే ఎంత నవీన భావనో! అలాగే, సృజనశీలుర ప్రభావం ఆ పై వాడికి కూడా అంతుచిక్కదని ఎంత సున్నిత హాస్యంతో చెప్పారో!

మానవసహజ భావోద్వేగాలను రాగద్వేషాలను పదిలపరుచుకోవడం ఎంత ముఖ్యమో కూడా ఈ కథ చెబుతుంది.

మావనవసంబంధాలలోని లాలిత్యం ఈ కథకు మూలసూత్రం.

అందుకే, ఈ కథ టాగోర్ కథల్లో ఎంతో ప్రత్యేకమైన కథ.

★

తెలుగు అనుసృజన కొరకై పరిశీలించిన **ఆంగ్లా**నువాదాలు.

1. A Wrong Man in Workers' Paradise, భవాని భట్టాచార్య , ది స్పెక్టేటర్, (1931)
http://archive.spectator.co.uk/article/17th-january-1931/12/a-wrong-man-in-workers-paradise

2. The Wrong Heaven ,అరొబిందో బోస్ ,లిపిక (1977, Peter Owen Limited, London, Rupa & Co,2002)

3. The Wrong Heaven, Palash Baran Pal (2004,parabaas)
https://www.parabaas.com/translation/database/translations/stories/gRabindranath_wronghe

COMMENTS